సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 25 । జూన్ । 2023



పర్యాటక ధామంగా పూతిగుంట
చవిటిదిబ్బలు పరిధిలోని పూతిగుంట పరమేశ్వరుని ఆలయ పరిసరాలు ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్నాయి. 8లో



ఘాట్‌లో జంగిల్ క్లియరెన్సు
కించూరు పంచాయతీకి వెళ్లే ఘాట్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్సు పనులను గిరిజనులు చేపట్టారు. 8లో



నాడు -నేడు పనులపై సమీక్ష
నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని హెచ్ఎంలు, సీఆర్పీలను గంగవరం ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు ఆదేశించారు. 9లో

న్యూస్‌రీల్

నేటి నుంచి సీలేరుకు నైట్ హాల్ట్ సర్వీసు

సీలేరు: విశాఖ ఆర్టీసీ డిపో నుంచి సీలేరుకు నైట్ హాల్ట్ బసు సర్వీస్ ఆదివారం నుంచి పునరుద్ధరించనున్నారు. మూడేళ్లక్రితం వివిధ కారణాలతో ఈ సర్వీసును నిలిపివేశారు. స్థానిక ప్రయాణికులు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఎంపీటీసీ సాంబమూర్తి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఇటీవల ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు విశాఖ నుంచి సీలేరు నైట్‌హాల్ట్ బస్సు సర్వీసును పునరుద్ధరించారు. విశాఖలోని సాయంత్ర 3.30 బయలుదేరి నర్సీపట్నం చింతపల్లి మీదుగా సీలేరుకు రాత్రి 9 గంటలకు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర రహదారిలో యథావిధిగా రాకపోకలు

- కూలిన చెట్టు తొలగింపు

సీలేరు: సీలేరు సమీపంలోని శుక్రవారం ఉదయం రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షాన్ని తొలగించడంతో అంతర్రాష్ట్ర వాహన రాకపోకలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో సుమారు మూడు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెనువెంటనే స్పందించిన అటవీశాఖ సిబ్బంది, స్థానికుల సాయంతో శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో అంతర్రాష్ట్ర రహదారిలోని శుక్రవారం అర్ధరాత్రి నుంచి రాకపోకలు జరుగుతున్నాయి. విద్యుత్‌లైన్ పునరుద్ధరణ పనులను లైన్‌మెన్ రాంబాబు దగ్గరుండి పర్యవేక్షించారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో లాష్య ప్రతిభ



ముంచంగిపుట్టు: నవోదయ ప్రవేశ పరీక్షల్లో మండలంలోని దార్రెల పంచాయతీ డీంగూడ గ్రామానికి చెందిన తంగుల లాష్య ప్రతిభను కనబరిచింది. 100 మార్కులకు గాను, 90 మార్కులను సాధించి సత్తా చాటింది. లాష్యను తల్లిదండ్రులు ఉల్లాస్‌కుమారి, జగత్‌రాయ్, గ్రామస్తులు, సీపీఎం జిల్లా నేత సన్నిబాబు తదితరులు అభినందించారు.

అమ్మ కళ్లలో ఆనందం

అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని పసిప్రాణాల సంరక్షణే ధ్యేయంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం సేవలందిస్తోంది. ఇక్కడ ఇప్పటివరకు 1429 మంది శిశువులకు అధునాతన వైద్యం అందించారు. నెలకు 30 మంది శిశువుల వరకు అత్యవసర వైద్యం పొందుతున్నారు. ఆక్యుపెన్సీ రేటు 80 శాతంగా నమోదు కావడంతో ఈ కేంద్రం ముస్కాన్ ప్రాజెక్టుకు ఎంపికైంది.

- పసిప్రాణాల సంరక్షణే లక్ష్యం
- శిశు మరణాల నియంత్రణ ధ్యేయం
- 24 గంటలూ నిరంతర వైద్యసేవలు
- సత్ఫలితాలిస్తున్న నవజాత శిశు కేంద్రాలు



చింతూరు ఏరియా ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో చికిత్స పొందుతున్న శిశువులు

చింతూరు: ఎంతో మంది పసిబిడ్డల ప్రాణాలను కాపాడటంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) జిల్లాలో ముందు వరుసలో ఉంది. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో శిశువుల సంరక్షణకు ప్రభుత్వం అధునాతన పరికరాలు, వైద్య నిపుణులను ఏర్పాటుచేసింది. దీంతో వైద్యంకోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండానే ఇక్కడే కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ హెల్త్ గ్రూప్ ఆధ్వర్యంలో..
మన్యంలో రక్తహీనత కారణంగా అధికంగా మాతా శిశు మరణాలు సంభవిస్తుంటాయి. అప్పుడే పుట్టిన బిడ్డలు సైతం ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శిశు మరణాలను తగ్గించేందుకు ఇంటిగ్రేటెడ్ హెల్త్ గ్రూప్(ఐహెచ్‌జీ) భాగస్వామ్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో 2018లో ఇక్కడ నవజాత శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం లేనప్పుడు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమహేంద్రవరం లేదా 65 కిలోమీటర్ల దూరంలోని భద్రాచలం ప్రభుత్వాస్పత్రులకు ఎన్నో అవస్థలకు గురై తీసుకువెళ్లేవారు.

సకాలంలో తీసుకొస్తే..
అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 90 రోజుల వయసు గల బిడ్డలకు అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. ప్రధానంగా పాలు సరిగ్గా పట్టకపోవడం, ఉమ్మపాలు, విరోచనం ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం, కామెర్లు, న్యుమోనియా, గ్యాస్టిక్‌తో పాటు ఇతర ఇన్‌ఫెక్షన్లు సంభవిస్తుంటాయి. తల్లిదండ్రులు వీటిని సకాలంలో గుర్తించకుంటే శిశు మరణాలు సంభవిస్తాయని, అనారోగ్య లక్షణాలు కనబడితే వెంటనే నవజాత శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకొస్తే శిశువులను రక్షించే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

నిరంతరంగా..
కేంద్రంలో చిన్న పిల్లల వైద్యనిపుణుడితో పాటు మెడికల్ ఆఫీసర్, ఐదుగురు స్టాఫ్‌నర్సులు శిశువులకు నిరంతర వైద్యం అందిస్తున్నారు. శిశువులకు వైద్యం అందించేందుకు ఐదు బెడ్లు, ఫొటోథెరపీ మిషన్లు, వార్మర్ (వేడిచేసే పరికరం), ఆక్సిజన్ మిషన్‌తో పాటు అత్యవసరంగా వైద్యం అందించేందుకు సీ–పాప్ మిషన్ అందుబాటులో ఉన్నాయి. ఈ కేంద్రంలో శిశువులకు వైద్యం అందించడంతో పాటు శిశు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

ముస్కాన్ ప్రాజెక్టుకు 'చింతూరు'

చింతూరు నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఇప్పటివరకు 1429 మంది శిశువులకు అధునాతమైన వైద్యం అందించారు. వీరిలో 938 ఆస్పత్రిలో పుట్టిన వారు కాగా 491 మంది ఇతర పీహెచ్‌సీలు, ఇళ్లవద్ద జన్మించారు. నెలకు 30 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా ఉండగా 500 వరకు ఔట్‌పేషెంట్లుగా ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. బెడ్ ఆక్యుపెన్సీ రేటు (బీవోఆర్) 80 శాతంగా ఉండటంతో ఈ కేంద్రం జాతీయస్థాయి నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో నిర్వహిస్తున్న 'ముస్కాన్' ప్రాజెక్టుకు ఎంపికైంది. దీనివల్ల ఈ కేంద్రానికి మరింత అధునాతనమైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

బిడ్డప్రాణం దక్కింది



ఈనెల 18న ప్రసవం నిమిత్తం ఆస్పత్రికి వెళుతుండగా మార్గ మధ్యలో కాన్పు అయింది. ఆడబిడ్డ పుట్టిన వెంటనే ఉమ్మునీరు మింగడంతో శ్వాస ఆడలేదు. వైద్యుల సూచనతో ఇక్కడికి తీసుకురాగా సకాలంలో అత్యవసర వైద్యం అందించడంతో బిడ్డ ప్రాణాలు దక్కాయి.

– కుంజా సమ్మక్క,
మల్లంపేట, చింతూరు మండలం

అధునాతన పరికరాలతో సేవలు



కేంద్రంలో అధునాతన వైద్య పరికరాలతో నవజాత శిశువులకు నిరంతర వైద్యసేవలు అందిస్తున్నాం. శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నెలకు 30కు పైగా శిశువులకు ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు.

– శ్రీహర్ష,
చిన్నపిల్లల వైద్యనిపుణులు

నిరంతర సేవలతో సాధ్యం



చింతూరు నవజాత శిశు సంరక్షణ కేంద్రం జాతీయస్థాయిలో ముస్కాన్ ప్రోగ్రాంకు ఎంపిక కావడం హర్షణీయం. చిన్నారులకు అందిస్తున్న నిరంతర వైద్యసేవల వల్లే సాధ్యమైంది. ముస్కాన్‌కు ఎంపికతో వైద్యసేవలు మరింత మెరుగుపడతాయి.

– డాక్టర్ కోటిరెడ్డి,
సూపరింటెండెంట్, చింతూరు ఏరియా ఆస్పత్రి

మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం

- ఎస్పీ తుహిన్ సిన్హా
- వై.రామవరం పోలీసుస్టేషన్ తనిఖీ

వై.రామవరం: జిల్లాలో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గుముఖం పట్టిందని ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల తరువాత స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. దీనిలో భాగంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న స్టేషన్ భవనాన్ని, సెంట్రీ పోస్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆభవనంలో చేయాల్సిన చేర్పులు మార్పులపై సలహాలు సూచనలు ఇచ్చారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుబలగాల భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. గతంలో వై.రామవరం మండలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో తప్పని సరిగా ఏరియా డామినేషన్, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

ఏజెన్సీలో మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పట్టినప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా సరిహద్దు అటవీప్రాంతంలో భారీ ఎత్తున నలువైపులా కూంబింగు, ఏరియా డామినేషన్ నిర్వహించడమే కాకుండా మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. భద్రత పరమైన అంశాలపై సీఐ వై.రాంబాబు, ఎస్ఐ ఎం సంతోష్‌కుమార్, అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబుకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే ప్రజలకు చేరువలో ఉండి, జనమైత్రి, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్య పరచాలని ఆదేశించారు.రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ ఇన్‌చార్జి అసిస్టెంటు కమాండెంటు వెంకటరమణ పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ
దేవీపట్నం: స్థానిక పోలీసుస్టేషన్‌ను శనివారం ఎస్పీ తుహిన్ సిన్హా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం పోశమ్మగండి వద్ద పాపికొండల టూరిజం బోటింగ్ పాయింట్‌తోపాటు పోలవరం ముంపు గ్రామాలను పరిశీలించారు. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్ల, సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ రంగారావు పాల్గొన్నారు.



సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



వై.రామవరం పోలీసు స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్‌సిన్హా



దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన రేపు



సాక్షి,పాడేరు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రమైన పాడేరులో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన ఖరారు కావడంతో అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. సోమవారం ఉదయం విశాఖ నుంచి మంత్రి రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 10.30గంటలకు పాడేరు చేరుకుంటారు. కుమ్మరిపుట్టులోని ఏపీఆర్ బాలికల జూనియర్ కళాశాలలో సికిల్‌సెల్ ఎనీమియా కిట్ల పంపిణీని ఆమె ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం11.40 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు.11.45 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. రూ.500కోట్లతో పాడేరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను మధ్యాహ్నం ఆమె పరిశీలిస్తారు. అనంతరం పాడేరులోని మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శిస్తారు. సాయంత్రం విశాఖపట్నం వెళ్తారు.

మన్యంలో ఖరీఫ్ సందడి

- ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- పొలాల్లో చేరిన నీరు
- కదిలిన ఏరువాక



పాడేరు మండలం భీమసింగి ప్రాంతంలో వరి నాట్లలో నిమగ్నమైన గిరి రైతులు



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: మన్యంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు వ్యవసాయానికి అనుకూలంగా మారాయి. గిరి రైతులు దుక్కి పనులు, నారుమడుల తయారీలో నిమగ్నమయ్యారు. పల్లపు ప్రాంతాల్లో ఇప్పటికే నారును సిద్ధం చేసుకున్న రైతులు నాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. పెదబయలు, అరకులోయ, డుంబ్రిగుడ, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, చింతపల్లి, కొయ్యూరు, గూడెంకొత్తవీధి మండలాల్లో వరినాట్లు హుషారుగా జరుగుతున్నాయి. పాడేరుకు సమీపంలోని చింతలవీధి, గబ్బంగి పంచాయతీల్లో వ్యవసాయ పనుల సందడి నెలకొంది. జిల్లాలో గతేడాది 54 వేల హెక్టార్లలో ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో నాట్లు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని 22 మండలాలకు సంబంధించి 18,500 క్వింటాళ్ల వరి విత్తనాలను 90 శాతం రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేపట్టింది. వీటిలో ఇప్పటికే 12 వేల క్వింటాళ్ల విత్తనం సరఫరా పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి నంద తెలిపారు.

చల్లబడిన మన్యం
కొయ్యూరు: రెండు రోజుల నుంచి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధపడ్డారు. దుక్కిపనుల్లో నిమగ్నమయ్యారు.

జి.మాడుగుల: మండలంలో కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

రాజవొమ్మంగి: మండలంలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో నాలుగు అడుగుల మేర నీరు చేరింది. రాజవొమ్మంగిలో వారపు సంతకు ఆటంకం ఏర్పడింది. ఉపాధి వేతనదారులు వర్షం కారణంగా మధ్యలోనే ఇళ్లకు వెళ్లిపోయారు.

వర్షపాతం వివరాలు: ఈనెల 23న ముంచంగిపుట్టులో 22.4ఎంఎం,పెదబయలులో 9.8, డుంబ్రిగుడలో 2.4, అరకులోయలో 2.6, హుకుంపేటలో 3.4, పాడేరులో 2.4, జి.మాడుగులలో 28.4, చింతపల్లిలో 5.2, జీకేవీధిలో 3.6, ఎటపాకలో 1.4, కూనవరంలో 1.2, చింతూరు 7.8, వి.ఆర్.పురంలో 30.6, మారేడుమిల్లిలో 1.2, వై.రామవరంలో 5.6, గంగవరంలో 1.8 ఎంఎం నమోదైంది. ఈనెల 24వ తేదీన ముంచంగిపుట్టులో 44.8, పెదబయలులో 30.2, డుంబ్రిగుడలో 5.2, అరకులోయలో 3.4, అనంతగిరిలో 1.6, హుకుంపేటలో 7.2, పాడేరులో 1.2, జి.మాడుగులలో 1.2, ఎటపాకలో 18.2, కూనవరం 15.2, వీఆర్‌పురంలో 14.4, దేవీపట్నంలో 9.2, వై.రామవరంలో 2.8, అడ్డతీగలలో 6.2, గంగవరంలో 5, రంపచోడవరంలో 1.4 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదైంది.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- రూ 3.89 కోట్లతో నిర్మించిన 14 భవనాలు ప్రారంభం



కుమ్మూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లి, తుమ్మల, కుమ్మూరు, ఏజీకొడేరు, కల్లేరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల భవనాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు పరిపాలనను అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామ సచివాలయాలు ఏర్పాటుచేసిందని తెలిపారు. అన్నదాతకు అండగా ఉండేందుకు రైతుభరోసా కేంద్రాలు, సకాలంలో వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రభుత్వం సేవలను మరింత చేరువ చేసిందన్నారు. గతంలో ధ్రువపత్రాలు ఇతర పనుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, నేడు గ్రామ సచివాలయాల ఏర్పాటుతో గ్రామాల్లోనే పనులు జరిగి పోతున్నాయని ఆమె వివరించారు. రైతుల మేలుకోసం తమ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణాలు తదితర పథకాలను అమలు చేయడంతో పాటు సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి సుస్థిర వ్యవసాయం చేసేందుకు రైతుభరోసా కేంద్రాలు ఎంతగానో దోహద పడతాయని ఆమె తెలిపారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే దూరంలో గల మండల కేంద్రంలోని ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వం గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని, దీనిద్వారా ప్రజలకు సకాలంలో వైద్యం అందుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా రూ 3.89 కోట్లతో నిర్మించిన 14 భవనాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ యడమ అర్జున్, కోఆప్షన్ మెంబర్ ఎండీ అక్బర్‌అలీ, సొసైటీ అధ్యక్షుడు శ్యామల విజయ్‌రెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ, రాంప్రసాద్, మురళి, సత్యన్నారాయణ, లక్ష్మారెడ్డి, రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ మురళి, తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో వెంకటరత్నం, సీడీపీవో విజయగౌరి, ఏఈ తరుణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంజనీరింగ్ అధికారిగా అదనపు బాధ్యతలు

పెదబయలు: గోమంగి గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిక్కుల శివరామయ్యను పెదబయలు మండల ఇంజనీరింగ్ అధికారి(పంచాయతీ రాజ్)గా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య తెలిపారు. ఇక్కడ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేసిన సంజీవరావు హుకుంపేట మండలానికి బదిలీపై వెళ్లడంతో అభివృద్ధి పనులకు జాప్యం జరగకుండా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు.

కించూరు ఘాట్‌లో జంగిల్ క్లియరెన్సు

సాక్షి, పాడేరు: మండలంలోని మారుమూల కించూరు పంచాయతీకి వెళ్లే ఘాట్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్సు పనులను శనివారం గిరిజనులు చేపట్టారు. నాలుగు కిలోమీటర్ల మేర తుప్పలు బాగా పెరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో చీకటి పడితే అడవి జంతువుల బెడద ఎక్కువగా ఉంటుంది. తుప్పలు తొలగించాలని సర్పంచ్ రాంబాబు అధికారులను ఇటీవల కోరారు. దీనిపై స్పందించిన వారు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరుచేశారు. జాబ్‌కార్డు ఉన్న గిరిజనులంతా సర్పంచ్ పర్యవేక్షణలో జంగిల్ క్లియరెన్సు పనులు చేపట్టారు.

గాయపడిన లారీ క్లీనర్ మృతి

అనకాపల్లిటౌన్: జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్ అహ్మద్ ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ బెంగుళూర్ నుంచి రాంచీ అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా వెళ్తుండగా డైట్ కళాశాల సమీపంలో శనివారం తెల్లవారుజామున ముందు వెళుతున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. దీంతో వెనక లారీలోని క్లీనర్ అహ్మద్‌కు తీవ్ర గాయాలైనట్టు ఎస్ఐ చెప్పారు. అతనిని ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్పగా చికిత్స పొందుతూ అహ్మద్ మృతి చెందాడు. ఈ మేరకు లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పర్యాటక ధామంగా పూతిగుంట

- పరమేశ్వరుని ఆలయం చెంతనే అందమైన జలపాతం
- తరలివస్తున్న భక్తులు, పర్యాటకులు



పూతిగుంట గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఉన్న పరమేశ్వరుని ఆలయం



ఆలయం సమీపంలోని సెలయేరులో స్నానాలాచరిస్తున్న భక్తులు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు సచివాలయం పరిధిలోని పూతిగుంట గ్రామ పరమేశ్వరుని ఆలయ ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయంగా దర్శనమిస్తోంది. ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. వివరాల్లోకి వెలితే ఆలయ ప్రాంతం మండలంలోని చవిటిదిబ్బలుగ్రామ ప్రధాన రహదారికి సుమారు 5 కిలోమీటర్లు దూరంలో దట్టమైన అటవీప్రాంతంలో ఉంది. ఆలయం చెంతనే అందమైన సెలయేరు ఉంది. ఆలయం ఎదుట పెద్ద బండరాయి పైనుంచి జలజలా పారే అందమైన జలపాతం దర్శనమిస్తోంది. మహాశివరాత్రిరోజు సుమారు 25 వేలు మంది పైగా భక్తులు దర్శించుకుంటారు. మిగిలిన రోజుల్లో అయ్యప్ప, సత్యదేవ. భవానీ మాలధారులు పరమేశ్వరుని ఆలయాన్ని సందర్శించి, పూజలు చేస్తుంటారు. కార్తీకమాసంలో స్థానికులతో పాటు, మైదానప్రాంతం నుంచి వచ్చి, ప్రతీరోజు వందలాది మంది పర్యాటకులు వనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జలపాతంలో జలకాలలాడుతుంటారు. ఈ ఆలయం అందమైన దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండడంతో పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు వారాంతాల్లో తరలిస్తుంటారు. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



వై.రామవరం మండలం పూతిగుంట పరమేశ్వరుని ఆలయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే బాగుంటుంది. ఇక్కడున్న దట్టమైన అటవీ ప్రాంతం, జలపాతం ప్రకృతి అందాలకు నిలయంగా దర్శనమిస్తోంది. ఆ ప్రాంతం పర్యాటకానికి చాలా అనుకూలంగా ఉంది. ఉన్నతాధిరులు స్పందించి సర్వే నిర్వహించాలి.

– కడబాల ఆనందరావు, ఎంపీపీ, వై.రామవరం

సర్వే చేయాలి



పూతిగుంట గ్రామం పర్యాటక ప్రదేశంగా పేరుపొందింది. దట్టమైన అటవీ ప్రాంతం, జలపాతం అందచందాలు తిలకించేందుకు ఇక్కడున్న ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. అధికారులు స్పందించి సర్వే నిర్వహించి, పర్యాటక కేంద్రంగా మార్చడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

– కుర్ర వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు, వై.రామవరం

జూలో పెద్ద పులి మృతి



పెద్ద పులి జానికి(ఫైల్)

ఆరిలోవ: జూ పార్కులో జానికి(22) అనే ఆడ పెద్ద పులి వృద్ధాప్యంతో శనివారం మృతి చెందింది. జూలో ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరించే జానికి కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురైంది. జూ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించినా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. వృద్ధాప్య కారణంగా అనారోగ్యానికి గురై కొన్ని రోజులుగా ఆహారం కూడా తినలేదని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. ప్రస్తుతం జూలో మూడు పెద్ద పులులున్నట్లు పేర్కొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



తాటిచెట్టు వద్ద వెంకయ్య మృతదేహం

మోతుగూడెం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సోదె వెంకయ్య (56) అనే వ్యక్తి తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం కల్లు గీయడానికి వెళ్లిన వెంకయ్య శనివారం ఉదయం వరకు ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా తాటి చెట్టు వద్ద మృతదేహం లభ్యమైంది. చెట్టుపై నుంచి పడిపోయినట్టు గుర్తించిన వారు వెంటనే మోతుగూడెం పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

27న సింహగిరిపై వరదపాయసం సేవ

సింహాచలం: సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టపై ఈనెల 27న వరదపాయసం సేవ నిర్వహించనున్నట్టు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో డి.భ్రమరాంబ తెలిపారు. వర్షాలు సంవృద్ధిగా కురవాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని సింహగిరి వైకుంఠవాసుడి మెట్టపై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో వరదపాయసం సేవ నిర్వహించడం పూర్వకాలం నుంచి వస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి వరదపాయసం సేవ ఉంటుందని తెలిపారు. వైకుంఠవాసుడికి విశేష పూజలు, పంచకలశ స్నపనం, పాయసం నివేదన ఉంటాయన్నారు. అనంతరం జారుడుబల్ల ఆకారంలో ఉండే కొండపై నుంచి పాయసం జారవిడవడం జరుగుతుందన్నారు.

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ వాడొద్దు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: వరహ లక్ష్మీ నృసింహస్వామి గిరి ప్రదక్షిణలో నిషేధిత ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున.. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అందించే ప్రసాదాలు, తీర్థ పానీయాలను ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల్లో అందజేయాలన్నారు. జీవీఎంసీ దాదాపు 100 పాయింట్లలో తాగునీరు, పలుచోట్ల వైద్య శిబిరాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తుందన్నారు. భక్తులకు తెలిసే విధంగా నీలం రంగు కలిగిన బెలూన్ వద్ద తాగునీరు, ఆకుపచ్చ రంగు బెలూన్ వద్ద డస్ట్‌బిన్లు, ఎరుపు రంగు బెలూన్ వద్ద వైద్య శిబిరం అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా వారి చేతి మణికట్టుపై ట్యాగ్‌ను కట్టేలా 20 చోట్ల ఏర్పాట్లు చేస్తామన్నారు. గిరి ప్రదక్షిణ విజయవంతానికి స్వచ్ఛంద సంస్థలు, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రతినిధులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాల సహకారం తీసుకుంటామన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ఆహార పదార్థాలను వాహనాల్లో తీసుకెళ్లేందుకు గతంలో పోలీసులు అనుమతి ఇవ్వలేదని తెలపగా.. కలెక్టర్ సూచన మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 32 కిలోమీటర్ల పరిధిలోని దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు దాడులు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, భారత వికాస్ పరిషత్ కార్యదర్శి పి.భాస్కరరావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాలుగా గుర్తించాలి

సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్రకటించాలని సీపీఎం రాష్ట కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం రాసిన లేఖను ఆయన మీడియాకు విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో తాను ఈ నెల 20, 21 తేదీల్లో పాదయాత్ర చేసిన సందర్భంలో ఆ ప్రాంత వాసులు ముంపు సమస్యను ప్రస్తావించారని శ్రీనివాసరావు తెలిపారు. 87 గ్రామాలకుపైగా వరదతో పాటు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ప్రకారం డబ్బులు చెల్లించి, ముంపు లేని చోట ఇళ్లు కట్టించి ఇవ్వాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు.

క్వారీ మెట్ట పై నుంచి జారిపడి యువకుడి మృతి



గెమ్మెల బుద్ధు మృతదేహం

అనంతగిరి: విజయనగరం జిల్లా వేపాడ మండలం సోంపురం పంచాయతీ నర్సిపల్లి క్వారీ మెట్టపై నుంచి జారిపడి మండలంలోని టోకూరు పంచాయతీ పూలుగుడ గ్రామానికి చెందిన గెమ్మెల బుద్ధు(30) అనే యువకుడు మృతి చెందాడు. శనివారం గెమ్మెల బుద్ధు మరో ఐదుగురు గిరిజనులతో కలిసి నర్సిపల్లి క్వారీలో పనికి వెళ్లాడు. క్వారీ మెట్టపై పనిచేస్తున్న గెమ్మెల బుద్ధు ప్రమాదవశాత్తూ జారిపడి రాళ్లగుట్టపై పడిపోవడంతో ఘటనస్థలంలోనే మృతిచెందాడు. అక్కడి సహచర కార్మికులు గ్రామస్తులు, కుటుంబీకులకు సమాచారం అందించారు. భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు వెంటనే క్వారీ వద్దకు చేరుకున్నారు. కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు, పలువురు నాయకులు ఘటనస్థలానికి చేరుకున్నారు.

పోషించే దిక్కు కోల్పోయి..



బుద్ధు (ఫైల్)

మృతుడు గెమ్మెల బుద్ధుకు, లక్ష్మితో 12ఏళ్ల క్రితమే వివాహం జరిగింది. వీరికి కీర్తన, సావ్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రతిరోజూ గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై క్వారీకి పనికివెళ్లి, తిరిగి వస్తుండేవాడు. క్వారీలో రోజు కూలి రూ.800 ఇస్తున్నారు. క్వారీకి వెళ్లిన భర్త వస్తాడని ఆశతో భార్య, ఇద్దరు పిల్లలు ఎదురుచూస్తుండగా, కుటుంబ యజమాని మరణవార్త విని కన్నీరుమున్నీరుగా విలపించారు. పోషించే దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది.